సాక్షి
పశ్చిమగోదావరి

బుధవారం । 20 । నవంబర్ । 2024



కన్నాపురం.. యువతకు ఆదర్శం

కన్నాపురం గ్రామ యువకులు ఏటా దీపావళీ బాణసంచా దుకాణాన్ని ఏర్పాటు చేస్తు న్నారు. అందులో లాభాన్ని గ్రామ సంక్షేమం కోసం వినియోగిస్తున్నారు. 8లో ▸



కార్గో సేవల్లో పశ్చిమ భేష్

ఆర్టీసీ కార్గో సేవల్లో పశ్చిమగోదావరి జిల్లా ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ మేరకు తణుకు ఆర్టీసీ డిపో ఆవరణలోని కార్గో ఏజెం ట్లకు సమావేశం నిర్వహించారు. 8లో ▸



కార్తీక దీపోత్సవం

కార్తీక మాసం ఆరుద్ర నక్షత్రం సందర్భంగా మంగళవారం శివాలయాలు హర నామ స్మరణతో మార్మోగాయి. అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. 8లో ▸

న్యూస్‌రీల్

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శిగా జెట్టి గురునాథరావు



జంగారెడ్డిగూడెం: పట్టణానికి చెందిన సీనియర్ నాయకుడు జెట్టి గురునాథరావు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ మేరకు వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం నుంచి నియామక ఉత్తర్వులు జారీ అయ్యాయి. జెట్టి గురునాథరావు ఎన్నికల ముందు పోలవరం నియోజకవర్గ పరిశీలకుడిగా పని చేశారు. ఇటీవల పార్టీలో క్రియాశీలక నేతగా వ్యవహరిస్తున్నారు. దీంతో అధిష్టానం ఆయన సేవలు గుర్తించి, పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా నియమించింది.

ప్రజలకు అండగా నిలవాలి



తూర్పుపాలెంలో నాయకులతో మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

పెనుగొండ: ప్రజలకు అండగా నిలిచి, వారి సమస్యల పరిష్కారానికి పోరాటం చేయాలని మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. మంగళవారం తూర్పుపాలెం క్యాంపు కార్యాలయంలో జరిగిన సమావేశంలో పాల్గొన్నారు. నియోజకవర్గంలోని సమస్యలను నాయకులు కార్యకర్తలు మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు దృష్టికి తీసుకెళ్లారు. ప్రజలను మభ్యపెట్టి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్నారు. ప్రజలు ఇప్పటికే సంక్షేమం అందక ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాష్ట్రంలో ఎన్నికష్టాలు వచ్చినా మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో వెనుకంజ వేయలేదన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు సుంకర సీతారామ్, జక్కంశెట్టి శ్రీరాములు, బుర్రా రవి కుమార్, రామన వీర్రాజు, నాయకులు కర్రి వేణుబాబు, కోట వెంకటేశ్వరరావు, గుబ్బల వీర బ్రహ్మం, తాతాజీ చింతపలి గురు ప్రసాద్, కొవ్వూరి చిన్న, పూరెళ్ల శ్రీను, రుద్ర ప్రసాద్, సుంకర నాగబాబు, సాకా సుబ్రహ్మణ్యం, మేడిచర్ల పండులు పాల్గొన్నారు.

స్కూళ్ల పనివేళల మార్పుతో ఇబ్బందులు

భీమవరం: ప్రభుత్వ పాఠశాలల పని వేళలు పెంచడాన్ని ఏపీటీఎఫ్ జిల్లా శాఖ తీవ్రంగా ఖండిస్తుందని ఏపీటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.ప్రకాశం, బీవీ నారాయణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామీణ ప్రాంతాలోని విద్యార్థులు దాదాపు 10 కిలోమీటర్లు దూరం కాలినడకన లేదా సైకిల్, బస్సు వంటి వాహనాల ద్వారా పాఠశాలలకు వచ్చి వెళ్లాల్సి ఉంటుందని ఇలాంటి తరుణంలో సాయంత్రం 5 గంటల వరకు పాఠశాలలు నిర్వహిస్తే విద్యార్థులు ఇళ్లకు చేరుకోవడం తీవ్ర ఇబ్బందికరంగా ఉంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రధానంగా ఉన్నత పాఠశాలల బాలికలు నివాసాలకు చేరుకునే సమయంలో అనేక ఇబ్బందులు, ప్రమాదాలు ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు. పాఠశాలల పనివేళల సమయం పెంచడం వల్ల పొందే లాభం కంటే నష్టాలు ఎక్కువగా ఉంటాయని వివరించారు.

23న మున్సిపల్ వర్కర్స్ యూనియన్ సమావేశం



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నేతలు

ఏలూరు (టూటౌన్): ఈ నెల 23న జంగారెడ్డిగూడెం లయన్స్ క్లబ్ హాలులో జరిగే మున్సిపల్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) జనరల్ బాడీ సమావేశం జయప్రదం చేయాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి భజంత్రీ శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. స్థానిక ఏఐటీయూసీ జిల్లా కార్యాలయం స్ఫూర్తి భవన్‌లో కరపత్రాల్ని మంగళవారం ఆవిష్కరించారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రజారోగ్యంలో పారిశుద్ధ్య కార్మికుల పాత్ర కీలకమన్నారు. కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్, ఆప్కాస్ విధానాన్ని రద్దుచేసి కార్మికులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డ్రైవర్లకు రూ.18,500 ఇవ్వాలని, పర్మినెంట్ కార్మికులకు సీపీఎస్ రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, ఆర్జిత సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ నెల 23న జంగారెడ్డిగూడెంలోని లయన్స్ క్లబ్ హాల్లో జనరల్ బాడీ సమావేశం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో దొడ్డికార్ల నాగబాబు, యలగాడ దుర్గారావు, కసింకోట నాగేంద్ర, ఇంటి అశోక్, డి రవీంద్ర పాల్గొన్నారు.

కేసులా.. లైట్ తీస్కోండి!

- సీఎం హెచ్చరికలను పట్టించుకోని మద్యం సిండికేట్
- తూతూమంత్రంగా కేసులు నమోదు చేస్తున్న ఎక్సైజ్ సిబ్బంది
- మద్యం షాపుల్లో యథేచ్ఛగా నిబంధనల ఉల్లంఘన
- గ్రామ గ్రామాన బెల్టుషాపులు, అధిక ధరలకు మద్యం విక్రయాలు



అత్తిలి మండలంలో నిర్వహిస్తున్న అనధికార మద్యం షాపు



తాడేపల్లిగూడెం నియోజకవర్గంలోని బెల్టు షాపు వద్ద తాగి పడేసిన సీసాలు

సాక్షి, భీమవరం: మద్యం అమ్మకాల్లో నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానాలు, ఏకంగా లైసెన్సే రద్దులంటూ పైకి కబుర్లు చెబుతారు. తీరా.. బెల్టు షాపు నిర్వాహకుడు దొరికితే ఐదారు బాటిల్స్‌తో పట్టుకున్నట్టు చూపించి స్టేషన్ బెయిల్ ఇచ్చి వదిలేస్తారు. ఆ బెల్టు నిర్వాహకుడికి బాటిల్స్ ఇచ్చి అమ్మకాలు చేయిస్తున్న మద్యం షాపు జోలికి మాత్రం పోరు. ఇది జిల్లాలోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ తీరు. ఎమ్మార్పీకి మించి అమ్మకాలు చేసినా, బెల్టు షాపులు ఏర్పాటు చేసినా మొదటిసారి రూ.ఐదు లక్షలు జరిమానా విధించాలని, రెండో సారి తప్పుచేస్తే షాపు లైసెన్స్ రద్దుచేయాలని ఇటీవల ఒక సమీక్షలో సీఎం చంద్రబాబు ఆదేశించిన విషయం విదితమే. లిక్కర్ బిజినెస్‌లో ఇలాంటి హెచ్చరికలు మామూలే అన్నట్టుగా సిండికేట్ వర్గాలు లైట్ తీసుకుంటున్నాయి. నిబంధనల ఉల్లంఘన యథేచ్ఛగా సాగుతోంది. షాపుల వద్ద పర్మిట్ రూంల మాదిరి సదుపాయాలు, గ్రామాల్లో బెల్టు షాపులు, అధిక ధరలకు మద్యం విక్రయాలు సాగిపోతున్నాయి. షాపులు ఏర్పాటయినప్పటి నుంచి ఇంతవరకు ఎక్సైజ్ అధికారులు జిల్లాలో బెల్టుషాపు నిర్వాహకులపై దాడులు నిర్వహించి 71 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 289 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నారు.

బాటిల్స్ ఏ షాపులోవో తెలిసినా.. మద్యం బాటిల్స్‌పై ఉన్న బ్యాచ్ నెంబర్ల ఆధారంగా అవి ఏ షాపు నుంచి వచ్చాయనే విషయాన్ని ఎక్సైజ్ అధికారులు ఇట్టే గుర్తిస్తారు. సీఎం ఆదేశాల నేపథ్యంలో బెల్టు షాపునకు మద్యం బాటిల్స్ ఇచ్చిన షాపునకు రూ.5 లక్షల ఫైన్ వేయాలి. వాటి జోలికి వెళ్లడం లేదు. బెల్టు నిర్వాహకుడిపై నామమాత్రపు చర్యలతో సరిపెడుతున్నారు. మద్యం సిండికేట్లకు స్థానిక ఎమ్మెల్యేల అండదండలు పుష్కలంగా ఉండటంతో వాటి జోలికి వెళ్లడం లేదు.

స్టేషన్ బెయిల్ ఇచ్చేలా కేసుల నమోదు

చట్ట విరుద్ధమే అయినా సంక్రాంతి పండుగల మూడు రోజులు కోడిపందేలు నిర్వహించడం తెలిసిందే. పందేలను అడ్డుకుని అరెస్టులు చేసినట్టుగా బైండోవర్ చేసేందుకు ఇద్దరు ముగ్గురు వ్యక్తులు, నాలుగైదు కోడిపుంజులు అప్పచెప్పాలని బరి నిర్వాహకులకు పోలీసులు ముందే చెబుతుంటారు. కోడి పందేలకు తెరవెనుక జరిగే ఈ వ్యవహారాన్ని ఇప్పుడు సిండికేట్ నిర్వాహకులతో ఎక్సైజ్ శాఖ నడుపుతోందన్న అనుమానాలున్నాయి. బెల్టు నిర్వాహకులపై దాడులు జరుగుతున్న తీరు, అక్కడ దొరికినట్టుగా చూపిస్తున్న బాటిళ్ల సంఖ్య ఇందుకు బలం చేకూరుస్తోంది. ఇప్పటివరకు ఎక్సైజ్ అధికారుల దాడుల్లో రెండు మూడు చోట్ల మాత్రమే పదికిపైగా బాటిళ్లు దొరికినట్టుగా చూపించగా మిగిలిన అన్ని చోట్ల తొమ్మిది బాటిళ్ల లోపే ఉంటున్నాయి. సాధారణంగా పదికి పైగా బాటిళ్లు దొరికితే నిందితుడ్ని, బాటిళ్లను కోర్టులో హాజరుపర్చాల్సి ఉంటుందని న్యాయవాది ఒకరు తెలిపారు. పది బాటిల్స్ లోపు ఉంటే సెక్షన్ 34 (ఏ) కింద కేసు నమోదుచేసి స్టేషన్ బెయిల్ ఇచ్చి వదిలేయవచ్చు. కోర్టులో నేరం రుజువైతే ఐదేళ్ల వరకు జైలు శిక్ష, రూ.లక్ష వరకు జరిమానా పడుతుంది. మధ్యవర్తుల సాక్ష్యం లేకుండా లోపభూయిష్టంగా కేసులు నమోదు చేయడం వల్ల నేరం రుజువై శిక్ష పడిన ఘటనలు చాలా అరుదు. నేరం రుజువుకాకపోవడం వల్ల ఈ కేసులను కోర్టు కొట్టివేస్తుంది. ఎక్సైజ్ అధికారులు కేసుల్లో తమ టార్గెట్లను చేరుకునేందుకు సిండికేట్ వర్గాల ద్వారానే ఒకరిద్దరిని పట్టుకుని తూతూమంత్రంగా కేసులు నమోదుచేయించి చేతులు దులుపుకుంటున్నట్టు తెలుస్తోంది.

ఎక్కడికక్కడ బెల్టు షాపులు

జిల్లాలో 175 మద్యం దుకాణాలకు 61 షాపులు పట్టణ ప్రాంతాల్లో, మిగిలిన 114 షాపులు పంచాయతీల పరిధిలో ఏర్పాటు చేశారు. మద్యం దుకాణాలు లేని గ్రామాల్లో బెల్టు షాపులు, పాయింట్ల పేరిట అమ్మకాలు చేస్తున్నారు. కొన్ని చోట్ల వేలం పాటలు, మరికొన్ని చోట్ల రూ. 50 వేలు నుంచి రూ.1.5 లక్ష వరకు డిపాజిట్లు చెల్లించిన వారికి, కూటమి కార్యకర్తలకు సిండికేట్లు బెల్టు నిర్వహణ బాధ్యతలను అప్పగించినట్టు తెలుస్తోంది. చిన్న దుకాణాలు, కిళ్లీ బడ్డీల్లో బాటిళ్లు ఉంచి క్వార్టర్, బీర్ బాటిల్‌కు ఎమ్మార్పీపై అదనంగా రూ.30 నుంచి రూ.50 వరకు అమ్మకాలు చేస్తున్నారు.



నర్సాపురం మండలం ఎల్‌బీ చర్ల మోడిలో బెల్ట్ షాపు

వివిధ హోటళ్లపై కేసుల నమోదు



హోటల్‌లో ఆహార పదార్థాలు పరిశీలిస్తున్న తనిఖీ అధికారులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో తనిఖీల సందర్భంగా పలు హోటళ్లపై కేసులు నమోదు చేసినట్లు జిల్లా రీజనల్ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి వీ.శ్రీరాంబాబు ఒక ప్రకటనలో తెలిపారు. దెందులూరు మండలం, సింగవరంలో నిర్వహిస్తున్న గరుడ ఫుడ్ కోర్టులో కృత్రిమ రంగులు కలుపుతున్నారని వచ్చిన సమాచారం మేరకు తమ విజిలెన్సు అధికారులు, లీగల్ మెట్రాలజీ అధికారులు, ఆహార పదార్థాల తనిఖీ అధికారులు మంగళవారం తనిఖీ చేయగా నిల్వ ఉంచిన మాంసాహారం గుర్తించారన్నారు. ఆహార పదార్థాల్లో కృత్రిమ రంగులు కలిపినట్లుగా వచ్చిన అనుమానంతో నమూనాలు సేకరించి విశ్లేషణ కోసం ల్యాబ్‌కు పంపించామన్నారు. గరుడ ఫుడ్ కోర్టులో లైసెన్స్ లేని రెండు ఎలక్ట్రానిక్ తూనికల యంత్రాలు, కేఎఫ్‌సీ ఫుడ్ కోర్టులో లైసెన్స్ లేని ఎలక్ట్రానిక్ తూనికల యంత్రాన్ని గుర్తించి లీగల్ మెట్రాలజీ అధికారి కేసులు నమోదు చేశారన్నారు. పెదపాడు మండలం, కలపర్రు టోల్ గేటు వద్ద నిర్వహిస్తున్న మురుగన్ హోటల్‌లో తనిఖీ చేయగా నిల్వ ఉంచిన మాంసాహారం గుర్తించామని, ఆహార పదార్థాల్లో కృత్రిమ రంగులు కలిపినట్లుగా వచ్చిన అనుమానంతో నమూనాలు సేకరించి విశ్లేషణ కోసం ల్యాబ్‌కు పంపించినట్టు తెలిపారు. ఈ హోటల్‌లో లైసెన్స్ లేని ఎలక్ట్రానిక్ తూనికల యంత్రాన్ని గుర్తించి లీగల్ మెట్రాలజీ అధికారి కేసులను నమోదు చేశారన్నారు.

మద్యం దుకాణం ఏర్పాటుపై దళితుల ఆందోళన



గొల్లలకోడేరులో మద్యం దుకాణం ఏర్పాటుపై ఆందోళన చేస్తున్న దళితులు

పాలకోడేరు: పాలకోడేరు మండలం గొల్లలకోడేరులో దళిత వాడకు దగ్గరగా మద్యం దుకాణం ఏర్పాటు చేయడంతో దళిత వాడకు చెందిన మహిళలు, యువకులు, గ్రామస్తులు ఆందోళనకు దిగారు. తమ మనోభావాలు దెబ్బతీసేలా ప్రార్థన మందిరానికి దగ్గరగా, విద్యార్థులు, మహిళలకు ఇబ్బందికరంగా ఉండేలా మద్యం దుకాణాన్ని ఏర్పాటు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్కడ షాపునకు పంచాయతీ ఎలా అనుమతులు ఇచ్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ స్మశాన వాటికకు వెళ్లడానికి వీలు లేకుండా మద్యం దుకాణం ఏర్పాటు చేయడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. అధికారులు స్పందించి ఈ మద్యం దుకాణాన్ని జనావాసాలకు దూరంగా తరలించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. అధికారుల నుంచి స్పష్టమైన హామీ వచ్చేవరకు ఆందోళన విరమించేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో పాలపర్తి ఆశీర్వాదమ్మ, దాసరి పద్మ, కే లక్ష్మి, నామాల దీప్తి, కె.ఉషశ్రీ, ఎస్.సాల్మన్, ఎం.పేతురు తదితరులు పాల్గొన్నారు.

పంట నియంత్రణ పాటించాలి



జంగారెడ్డిగూడెంలో రైతులతో మాట్లాడుతున్న పొగాకు బోర్డు చైర్మన్ యశ్వంత్

జంగారెడ్డిగూడెం/కొయ్యలగూడెం: రైతులు పంట నియంత్రణ పాటించాలని వర్జీనియా పొగాకు బోర్డు చైర్మన్ యశ్వంత్ అన్నారు. జంగారెడ్డిగూడెం వర్జీనియా వేలం కేంద్రంలో మంగళవారం ఆయన రైతులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పొగాకు పండించే దేశాల్లో ఈ ఏడాది పొగాకు అధికంగా ఉత్పత్తయిన కారణంగా రైతులు పంట నియంత్రణ పాటించాలని కోరారు. ప్రస్తుత అంతర్జాతీయ పొగాకు మార్కెట్ పరిస్థితిని వివరించారు. పొగాకు సాగుకు అనువైన నేలలను ఎంపిక చేసుకుని నాణ్యమైన పొగాకు పండించాలని, లో గ్రేడ్ నివారించుకుంటూ ఎన్ఎల్ఎస్ బ్రాండ్ వాల్యూను కాపాడేలా అధిక నికోటిన్ ఇచ్చే కండ కలిగిన ఆరెంజ్ స్టైల్ పొగాకును పండించేందుకు రైతులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రైతులు బోర్డు నిర్దేశించిన పంట విస్తీర్ణం, పరిమాణానికి కట్టుబడి సాగు చేట్టాలన్నారు. కొయ్యలగూడెం వర్జీనియా పొగాకు వేలం కేంద్రంలో రైతు సమావేశంలో పాల్గొని పలు అంశాలపై మాట్లాడారు.

కొమ్ముగూడెం సొసైటీని ఆదర్శంగా తీసుకోవాలి



కొమ్ముగూడెం సొసైటీ వద్ద సహకార పతాకాన్ని ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్ నాగరాణి

తాడేపల్లిగూడెం రూరల్: కొమ్ముగూడెం సొసైటీని ఆదర్శంగా తీసుకుని జిల్లాలోని పీఏసీఎస్‌లలో వ్యాపార కార్యకలాపాలను నిర్వహించాలని కలెక్టర్ సీహెచ్.నాగరాణి పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని కొమ్ముగూడెం సొసైటీ వద్ద సహకార వారోత్సవాల సభ నిర్వహించారు. తొలుత సహకార పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం సభలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాకు కేటాయించిన 24 మల్టీపర్పస్ గోదాముల నిర్మాణాలలో ఇప్పటి వరకు 12 పూర్తి చేసుకుని కార్యకలాపాలను సాగిస్తున్నాయన్నారు. మిగిలినవి నిర్మాణ దశలో ఉన్నాయన్నారు. సహకార సంఘాల ద్వారా రూ.36 కోట్ల రుణాలు అందించామని, మరో రూ.15 కోట్ల టర్నోవర్‌తో పది రకాల వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తున్నామన్నారు. కొమ్ముగూడెం సొసైటీ రూ.4.90 కోట్ల మూలధనంతో నిర్వహించడం గర్వించదగ్గ విషయమన్నారు. కొమ్ముగూడెం సొసైటీ కార్యకలాపాలపై అవగాహన కల్పించేందుకు జిల్లాలోని ఇతర పీఏసీఎస్‌ల సిబ్బందితో విజిట్ చేయించాలన్నారు. తాడేపల్లిగూడెం ప్రాంతంలో ఎక్కువగా పామాయిల్, కోకోనట్ పరిశ్రమను అభివృద్ధి చేసేందుకు అవకాశాలకు ఆలోచన చేసి మహిళలు, యువతకు అవకాశం కల్పించడం ద్వారా దేశానికి, రాష్ట్రానికి మంచి పేరు తేవాలన్నారు. జిల్లా సహకార అధికారి నాగరాజు, తాడేపల్లిగూడెం ఆర్డీవో ఖతీబ్ కౌసర్ బనో, జిల్లా రిజిస్ట్రార్ కే.వెంకటేశ్వరరావు, సొసైటీ సీఈవో సీహెచ్ఎస్‌వీ. కృష్ణ శర్మ, తహసీల్దార్ సునీల్ కుమార్, ఎంపీడీవో ఎం.విశ్వనాథ్, సర్పంచ్ తాడేపల్లి బేబి తదితరులు పాల్గొన్నారు.

మహిళలు, బాలికల రక్షణకు ప్రత్యేక చర్యలు



ద్వారకా తిరుమల పోలీసు స్టేషన్ వద్ద ఐజీ అశోక్ కుమార్‌కు గౌరవ వందనం చేస్తున్న సిబ్బంది

ఏలూరు రేంజ్ ఐజీ అశోక్ కుమార్

ద్వారకాతిరుమల: ఏలూరు జిల్లాతో పాటు ఇతర జిల్లాల్లో మహిళలు, బాలికల రక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్ కుమార్ తెలిపారు. వార్షిక తనిఖీల్లో భాగంగా మంగళవారం ద్వారకాతిరుమల పోలీస్టేషన్‌కు విచ్చేసిన ఆయనకు సిబ్బంది గౌరవ వందనం సమర్పించారు. జిల్లా ఎస్పీ కె.ప్రతాప్ శివ కిషోర్‌తో కలిసి క్రైం రికార్డులు పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. ప్రతి జిల్లాలో మహిళలు, బాలికల రక్షణకు ప్రత్యేక టీంలు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. జిల్లాలో అభయ పేరుతో ఈ టీం పనిచేస్తుందన్నారు. కాలేజీలు, పాఠశాలలు, బస్టాప్‌లు ఇతర ముఖ్య ప్రదేశాల్లో ఈవ్ టీజింగ్, ఇతర నేరాలు జరగకుండా ఈ టీంలతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. రెగ్యులర్‌గా కాలేజీలు, పాఠశాలల్లో ఎడ్యుకేషన్ ప్రోగ్రాంలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. చిన్న పిల్లలపై నేరాలకు పాల్పడే వారిపై ప్రత్యేక దృష్టి సారించామని, అందులో భాగంగా వారిపై రౌడీ షీట్లు, సస్పెక్ట్ షీట్లు తెరిచి, ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తున్నామన్నారు. గంజాయి కేసుల్లో త్వరితగతిన విచారణను పూర్తి చేసి, ముద్దాయిలను అరెస్టు చేసి, రిమాండ్‌కు పంపి, చార్జ్‌షీట్లను దాఖలు చేస్తున్నామన్నారు. ఐదు, పదేళ్లుగా తమ రికార్డుల్లో ఉన్న గంజాయి, దొంగతనాలు, పోక్సో కేసుల్లోని నేరస్తుల ఫొటోలు, వారి వేలిముద్రలను డిజిటలైజ్ చేస్తున్నట్టు తెలిపారు. శ్రీవారి క్షేత్రంలో భక్తుల రద్దీ ఎక్కువగా ఉండే శనివారం, ఇతర పర్వదినాల్లో జేబు దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్నాయని, వాటిని అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆలయానికి భద్రత కల్పించడంతో పాటు, భక్తులకు ఇబ్బందులు కలుగకుండా అన్ని వేళల్లో, ముఖ్యంగా పర్వదినాల్లో జరిగే ఉత్సవాల్లో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ద్వారకాతిరుమల పోలీస్టేషన్ పరిధిలో పెద్ద సమస్యలేమీ లేవని, శాంతి భద్రతలు కూడా బాగానే ఉన్నాయన్నారు.

చిన్న వెంకన్నను దర్శించుకున్న ఐజీ

చినవెంకన్న ఆలయాన్ని ఐజీ జీవీజీ అశోక్ కుమార్, ఎస్పీ కె.ప్రతాప్ శివ కిషోర్‌లు మంగళవారం సందర్శించారు. వారికి దేవస్థానం అధికారులు, అర్చకులు తూర్పు రాజగోపురం వద్ద మర్యాద పూర్వకంగా స్వాగతం పలికారు. వారు స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో అర్చకులు, పండితులు వారికి శ్రీవారి శేష వస్త్రాలను కప్పి, వేద ఆశీర్వచనాన్ని పలుకగా, ఆలయ ఈఓ ఎన్‌వీఎస్ఎన్ మూర్తి స్వామివారి మెమెంటోలు, ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ డి.శ్రావణ్ కుమార్, భీమడోలు సీఐ యూజే విల్సన్, ద్వారకాతిరుమల, భీమడోలు ఎస్సైలు టి.సుధీర్, సుధాకర్ తదితరులు ఉన్నారు.

లేసు పార్కు అభివృద్ధిపై చర్చలు

ప్రోత్సాహానికి నాబార్డు హామీ



రుస్తుంబాద లేసుపార్కులో చర్చిస్తున్న నాబార్డు అధికారులు

నరసాపురం రూరల్: లేసు, అల్లిక పనులు చేసే మహిళల ఆర్థికాభివృద్ధి ప్రణాళికలపై నాబార్డు డీడీఎం అనిల్ కాంత్ మార్కెటింగ్ రుస్తుంబాద లేసుపార్కు అధికారులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. లేసు పార్కులో లేసు అల్లికల మహిళలకు వృత్తి నైపుణ్యం పెంపొందించేందుకు డీఆర్డీఏ సహకారంతో గతంలో లేసు పార్కులో మహిళలకు నిర్వహించిన చేతి వృత్తులకు సంబంధించి ఇచ్చిన శిక్షణ, తదితర అంశాలపై చర్చించారు. చేతి వృత్తుల అల్లికలతో పాటు ఉత్పత్తులకు సంబంధించి మార్కెటింగ్ కల్పించడంతోపాటు ఉత్పత్తుల విక్రయాలు చేపట్టేందుకు ప్రోత్సహిస్తామని నాబార్డు అధికారులు డీఆర్డీఏ పీడీ ఎంఎస్ఎస్ వేణుగోపాల్‌కు హామీ ఇచ్చారు. అందుకు సంబంధించిన సాధ్యాసాధ్యాలపై చర్చించారు. గతంలో ఇచ్చిన శిక్షణకు సంబంధించిన డాక్యుమెంటేషన్ పూర్తి చేసుకునేందుకు ఎగ్జిమ్ బ్యాంకు సిబ్బంది కూడా లేసుపార్కును సందర్శించి డాక్యుమెంటేషన్ పూర్తి చేసే పనులు చేపట్టారు. లేసు పార్కును సందర్శించిన వారిలో నాబార్డు డీడీఎం(ఏలూరు) టి.అనిల్‌కాంత్, శార్ట్ ఎన్‌జీవో సంస్థ ప్రతినిధి వర ప్రసాద్, డీఆర్డీఏ పీడీ ఎంఎస్ఎస్ వేణుగోపాల్, లేసుపార్కు ప్రాజెక్టు మేనేజర్ ఎస్ కుసుమకుమారి తదితరులు ఉన్నారు.

హమాలీల జీతాలు పెంచాలి



ఏలూరులోని ఎఫ్‌సీఐ గోడౌన్ వద్ద ధర్నా చేస్తున్న హమాలీలు

ఏలూరు (టూటౌన్): పౌరసరఫరాల శాఖలో పని చేస్తున్న హమాలీలకు ప్రతి రెండేళ్ల ఒకసారి జీతాలు పెంచుతూ ఒప్పందం చేసుకున్నారని, 2024 జనవరి కల్లా ఆ ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉన్నా ఇంతవరకు చేయకపోవడాన్ని నిరసిస్తూ ఏపీ పౌరసరఫరాల సంస్థ గోడౌన్స్ జట్టు వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా హమాలీలు మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.లింగరాజు, యూనియన్ జిల్లా అధ్యక్షులు శేఖర్ మాట్లాడుతూ యూనియన్‌తో చర్చలు జరిపి తక్షణమే హమాలీల జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఒప్పంద కాలం పూర్తయి 11 నెలలైనా ప్రభుత్వాలు స్పందించకపోవడం దారుణమన్నారు. పౌరసరఫరాల శాఖలో మండల గ్రామ స్థాయిలో నిత్యావసరాలను రేషన్ షాపులకు చేరవేసే కార్మికుల కష్టానికి వెలకట్టలేమన్నారు. కార్మికులు ఎంతో కష్టపడి సరుకులను మండల స్టాక్ పాయింట్ల నుంచి గ్రామాల్లో ఉన్న రేషన్ షాపులకు చేరవేస్తున్నారని తెలిపారు ఒక్కరోజు కూడా లేట్ కాకుండా పనిచేస్తున్నామని తమ కష్టాన్ని ఈ ప్రభుత్వం గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. తక్షణమే ప్రభుత్వం స్పందించాలని కోరుతూ ఏలూరు జిల్లాలోని ఏలూరు, పాతూరు, ధర్మాజీ గూడెం, జంగారెడ్డిగూడెం, కుకునూరు, కేఆర్ పురం, నూజివీడు, కైకలూరు ఎంఎల్ఎస్ పాయింట్ల వద్ద కార్మికులు నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమాల్లో రాంబాబు, దుర్గారావు, మస్తాన్ వలి, ముప్పిడి అబ్బులు తదితరులు నాయకత్వం వహించారు.

క్లుప్తంగా

2,800 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం



బెల్లపు ఊటను ధ్వంసం చేసిన ఎక్సైజ్ సిబ్బంది

నూజివీడు: చాట్రాయిలో మంగళవారం ఎక్సైజ్ సిబ్బంది దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 2,800 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి, బానోతు రాజు అనే వ్యక్తిని అరెస్ట్ చేసి కోర్టుకు తరలించినట్లు ఎక్సైజ్ సీఐ ఏ మస్తానయ్య తెలిపారు. అలాగే దాడులు నిర్వహిస్తుండగా పారిపోయిన బాణావతు కృష్ణ, అజ్మీర శ్రీనులపై కేసు నమోదు చేశామన్నారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్సైలు వై ఈశ్వరరావు, ఎం ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

బయ్యన్నగూడెంలో చైన్ స్నాచింగ్

కొయ్యలగూడెం: బయ్యనగూడెంలో జరిగిన చైన్ స్నాచింగ్ ఘటనపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాల ప్రకారం గ్రామానికి చెందిన సుంకర సత్యవతి మెయిన్ రోడ్డు లోని తన కుమారుడి షాపు నుంచి సాయంత్రం 6 గంటలకు ఇంటికి తిరిగి వెళుతుండగా ఎస్సీ పేటలోని అంబేద్కర్ విగ్రహం వద్దకు వచ్చేసరికి హెల్మెట్ పెట్టుకుని ఉన్న దుండగుడు బైక్‌పై వచ్చి ఆమె మెడలోని సుమారు నాలుగు కాసుల బంగారు తాడును లాక్కొని పారిపోయాడు. ఈ ఘటనపై సత్యవతి భర్త సోమరాజు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

సౌత్‌జోన్ రైఫిల్ షూటింగ్ పోటీలకు విష్ణు విద్యార్థి



విద్యార్థి ప్రదీప్‌చంద్రను అభినందిస్తున్న దృశ్యం

భీమవరం: సౌత్‌జోన్ రైఫిల్ షూటింగ్ పోటీలకు భీమవరం విష్ణు ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థి వి ప్రదీప్‌చంద్ర ఎంపికైనట్లు కళాశాల ఫిజికల్ డైరెక్టర్ ఎం శ్రీనివాసరావు మంగళవారం విలేకరులకు తెలిపారు. విజయవాడలోని వీఆర్ సిద్ధార్థ కళాశాలలో ఈనెల 15వ తేదీన నిర్వహించిన జేఎన్‌టీయూకే 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ షూటింగ్ విభాగంలో ప్రదీప్‌చంద్ర ప్రతిభ కనబరిచి సౌత్‌జోన్ పోటీలకు ఎంపికయ్యాడన్నారు. డిసెంబర్‌లో పంజాబ్ రాష్ట్రంలోని ఛండీగడ్ యూనివర్సిటీలో నిర్వహించే సౌత్‌జోన్ పోటీల్లో ప్రదీప్‌చంద్ర పాల్గొంటాడన్నారు. అనంతరం క్రీడాకారుడ్ని కళాశాల ప్రిన్సిపాల్ ఎం వేణు, వైస్ ప్రిన్సిపాల్ ఎం శ్రీలక్ష్మి, శ్రీనివాసరావు తదితరులు అభినందించారు.

పాందువ్వలో చోరీ

ఉండి: ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఇంట్లో చోరీ జరిగిన ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై శ్రీనివాస్ తెలిపారు. వివరాల ప్రకారం ఉండి మండలం పాందువ్వ గ్రామానికి చెందిన అల్లూరి రవికుమార్ హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నాడు. వర్క్ ఫ్రం హోంలో భాగంగా పాందువ్వలోని ఇంటివద్దనే ఉండి విధులు నిర్వర్తిస్తున్నాడు. అయితే పిల్లలకు పరీక్షలు ఉండడంతో ఈ నెల 15వ తేదీన కుటుంబ సమేతంగా హైదరాబాద్‌కు వెళ్లి తిరిగి 18వ తేదీ ఉదయం 7 గంటలకు ఇంటికి చేరుకున్నారు. ఇంటి తాళాలు పగులగొట్టి ఉండడంతో లోపలికి వెళ్లి చూడగా బీరువాలోని రూ.50 వేలు, రూ.45 వేల విలువైన వెండి వస్తువులు చోరీకి గురైనట్లు గుర్తించారు. బాధితుడు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

కన్నాపురం.. యువతకు ఆదర్శం

- గ్రామంలో దీపావళి బాణసంచా దుకాణాన్ని నిర్వహిస్తున్న ఫ్రెండ్స్ టీం
- వచ్చిన లాభాన్ని గ్రామాభివృద్ధికి వెచ్చిస్తూ స్ఫూర్తి నింపుతున్న యువత

కొయ్యలగూడెం: ఆ యువకులు తమ ఆలోచనా, ఆచరణలతో పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. లాభాపేక్ష లేకుండా వ్యాపారం నిర్వహించడమే కాకుండా వచ్చిన ఆదాయాన్ని గ్రామాభివృద్ధికి వినియోగించి శభాష్ అనిపించుకుంటున్నారు. కన్నాపురం గ్రామానికి చెందిన యువకులు సమిష్టిగా ఏర్పడి దీపావళి వేడుకకు గ్రామంలో ఫ్రెండ్స్ దీపావళి టపాసుల షాప్ పేరిట బాణసంచా దుకాణాన్ని ఏర్పాటు చేస్తున్నారు. అందులో వచ్చిన లాభాన్ని గ్రామ సంక్షేమం కోసం వినియోగిస్తున్నారు. నాలుగు సంవత్సరాలుగా ఈ విధంగా చేస్తుండడంతో దాదాపు రూ.ఆరున్నర లక్షల వరకు పొదుపు పెట్టారు. దీంతో గ్రామంలో రూ.రెండున్నర లక్షలతో శ్రీ సత్యసాయి వాటర్ ట్యాంక్, శ్రీ అభయ ఆంజనేయ స్వామి ఆలయం వద్ద 1.20 లక్షల లీటర్ల సామర్థ్యం కలిగిన మినరల్ వాటర్ ప్లాంట్, ప్రమాదకరంగా ఉన్న కాలువలో ప్రయాణికుల రక్షణార్థం రూ.1.10 లక్షలతో పడమటి కాలువకు ఇరువైపులా సేఫ్టీ పోల్స్, స్ట్రీట్ లైట్స్ ఏర్పాటు చేశారు. భవిష్యత్‌లో ప్రభుత్వ ప్రోత్సాహంతో గ్రంథాలయం, అదేవిధంగా పీహెచ్‌సీ ఏర్పాటు చేయాలని సంకల్పంతో కొనసాగుతున్నామన్నారు. యువకుల లాభాపేక్ష లేని ఆలోచనలకు గ్రామ పెద్దలు కూడా ఒకే మాట మీద నిలబడి పార్టీలకు అతీతంగా వారికి సహకరిస్తూ బాణాసంచా దుకాణాన్ని ప్రోత్సహిస్తున్నారు. గ్రామస్తులంతా ముందుగానే తీర్మానం చేసి వేరొక షాపునకు అవకాశం లేకుండా వీరిని ప్రోత్సహిస్తున్నారు.

ఆ యువకులే వీరంతా

ఫ్రెండ్స్ టీమ్‌లో బొమ్మ జయ సూర్య వినయ్‌కుమార్, నల్లజర్ల అనిల్ కుమార్, వీఎం సాయికుమార్, గుడిమెట్ల సుబ్రహ్మణ్యం, మట్టే వెంకట శ్రీనివాసరావు, అద్దేపల్లి కేశవ సత్యనారాయణ, బొమ్మ తేజా సాయికుమార్, ఉప్పల మణికంఠ సతీష్, గుడిమెట్ల నరసింహారావు, గుడిమెట్ల రాంబాబు, నల్లజర్ల సునీల్‌కుమార్, వెత్సా రాజేష్ కుమార్, మద్దు మణికంఠ, కేవిబి శ్రేష్టి, అద్దేపల్లి సాయి మణితేజ, బొమ్మ వంశీకృష్ణ, బొమ్మ ఫణిరాజా తదితరులు ఉన్నారు.



దీపావళి బాణసంచా దుకాణాన్ని నిర్వహిస్తున్న యువత (ఫైల్)



ఆర్వో వాటర్ ప్లాంట్ (ఫైల్)



సత్య సాయి తాగునీటి వాటర్ ట్యాంక్ (ఫైల్)



పడమటి కాలువ వద్ద విద్యుత్ స్తంభాల ఏర్పాటు (ఫైల్)

గ్రామస్తులంతా ప్రోత్సహిస్తున్నాం



ఫ్రెండ్స్ దీపావళి టపాసుల షాప్ టీం సభ్యులను గ్రామస్తులంతా ఏకమై ప్రోత్సహిస్తున్నాం. మేమంతా అదే షాపు వద్ద బాణసంచా కొనుగోలు చేసి మా వంతు సహాయం అందిస్తున్నాం. పోటీ కోసం వేరొక షాపు పెట్టుకునే వారిని అనునయించి గ్రామ పెద్దల సహకారంతో ఏకాభిప్రాయాన్ని సాధిస్తున్నాం.

– కొల్లంశెట్టి కళ్యాణ్. కన్నాపురం గ్రామస్తుడు

అందరికీ మేలు కలిగేలా..



దీపావళి వేడుక ఏ ఒక్క మత సామాజిక వర్గానికి చెందినది కాకుండా మా గ్రామంలో అన్ని సామాజిక వర్గాల వారు ఆనందంతో నిర్వహించుకుంటూ స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నారు. అన్ని సామాజిక వర్గాల ప్రజలకు మేలు కలిగే విధంగా ఉండే వనరులను ఏర్పాటు చేయడానికి కృషి చేస్తున్నాం.

– మట్టే శ్రీనివాసరావు, ఫ్రెండ్స్ దీపావళి టపాసుల షాప్ టీం సభ్యుడు, కన్నాపురం

కోళ్ల వ్యర్థాల వాహనాల సీజ్



సీజ్ చేసిన కోళ్ల వ్యర్థాల వాహనాలు

పెదపాడు: అక్రమంగా తరలిస్తున్న 3 కోళ్ల వ్యర్థాల వాహనాలను సీజ్ చేసినట్లు పెదపాడు పోలీసులు తెలిపారు. నాయుడుగూడెం, వెంకటాపురం, రాజుపేట గ్రామాల వద్ద మూడు వాహనాల్లో కోళ్ల వ్యర్థాలు తరలిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించి వాహనాలను అదుపులోకి తీసుకుని సీజ్ చేసినట్లు పెదపాడు ఎస్సై కట్టా శారదా సతీష్ తెలిపారు. వాహన యజమాని, డ్రైవర్, చెరువు యజమానులపై చర్యలు చేపడతామన్నారు.

పాఠశాలల్లో ప్రస్తుత పనివేళలే కొనసాగించాలి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): పాఠశాలల్లో ప్రస్తుత పనివేళలే కొనసాగించాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి బీఏ సాల్మన్ రాజు, ఏలూరు జిల్లా శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు టీ రామారావు, బీ రెడ్డి దొర మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి పాఠశాలలు ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగేలా ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, ఇది ఆచరణ సాధ్యం కాదని తెలిపారు. ఉన్నత పాఠశాలల్లో చదువుకోవడానికి సుమారు ఐదు కిలోమీటర్ల దూరం నుంచి విద్యార్థులు వస్తారని, సాయంత్రం ఐదు గంటల వరకు పాఠశాలలు కొనసాగించడం వలన వారు అనేక ఇబ్బందులు పడే అవకాశం ఉందన్నారు. పాఠశాలల పనివేళలు పెంచడం వలన క్రీడలకు కూడా సమయం ఉండదని, వీటన్నింటిని పరిగణనలోకి తీసుకుని ప్రస్తుత పనివేళలనే కొనసాగించాలని కోరారు.

రూ.252 కోట్లతో అగ్నిమాపక శాఖ ఆధునికీకరణ పనులు

అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ ఫైర్ సర్వీసెస్ శ్రీనివాసులు



కైకలూరు అగ్నిమాపక కేంద్రంలో ఫైర్ ఇంజిన్‌ను పరిశీలిస్తున్న ఫైర్ సర్వీసెస్ ఏడీ శ్రీనివాసులు

కైకలూరు: రాష్ట్రంలో రూ.252 కోట్లతో అగ్నిమాపకశాఖ ఆధునికీకరణ పనులు చేపడుతున్నట్లు అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ ఫైర్ సర్వీసెస్ జి.శ్రీనివాసులు చెప్పారు. కైకలూరు ఫైర్‌స్టేషన్‌ను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘ నిధుల్లో అగ్నిమాపక శాఖకు రూ.252 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. ఇందులో 75 శాతం కేంద్రం, 25 శాతం రాష్ట్ర వాటా ఉందన్నారు. ఈ నిధులతో 100 నూతన ఫైర్ వెహికల్స్, 17 నూతన అగ్నిమాపక కేంద్రాలు, మరో 37 అగ్నిమాపక కేంద్రాల ఆధునికీకరణ పనులు చేయనున్నట్లు చెప్పారు. భారీ వాహనాలు చేరుకోలేని ఇరుకు ప్రాంతాల్లో మంటలను అదుపు చేయడానికి 300 లీటర్ల కెపాసిటీ కలిగిన 50 క్విక్ రెస్పాండ్ వెహికల్స్‌ను అందుబాటులో ఉంచుతామన్నారు. ముఖ్యంగా 108 మాదిరిగా 112 కాల్ కమాండ్ సెంటర్‌ను విజయవాడలో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వాహనాలకు ఏర్పాటు చేసిన జీపీఎస్ సిస్టం ద్వారా కాలర్ లొకేషన్‌ను గుర్తించి త్వరగా ఘటనా స్థలానికి చేరే అవకాశం ఉందన్నారు. విజయవాడలో 15 అంతస్తుల వరకు చేరే యంత్రాన్ని జపాన్ నుంచి కొనుగోలు చేశామన్నారు. అదే విధంగా విశాఖపట్టణంలో 30 అంతస్తులు చేరే యంత్రాన్ని ఫిన్‌ల్యాండ్ నుంచి తీసుకొచ్చామన్నారు. విపత్తు సమయంలో పనిచేసే విధంగా నైపుణ్యాలు పెంపొందించుటకు సిబ్బందికి నాగపూర్, బెంగుళూరు, ఒరిస్సాలో శిక్షణ అందించడానికి ప్రణాళిక రూపొందించామన్నారు. విపత్తుల కాలంలో కమ్యూనికేషన్ కోసం ప్రత్యేక శాటిలైట్ వ్యవస్థతో ఫైర్ వెహికల్స్‌ను అనుసంధానం చేస్తామన్నారు. కొల్లేరు ప్రాంత ఆక్వా దుకాణాల్లో బ్లీడింగ్ నిల్వ వల్ల అగ్ని ప్రమాదాలు జరుగుతున్నట్లు తెలిసిందన్నారు. వ్యాపారులందరికీ ప్రమాద నివారణలపై అవగాహన కలిగిస్తామన్నారు. రాష్ట్రంలో 175 నియోజకవర్గాల్లో ప్రతి నియోజకవర్గానికి త్వరలో ఫైర్‌స్టేషన్ అందుబాటులోకి వస్తాయన్నారు. కైకలూరు నియోజకవర్గంలో ప్రజాప్రతినిధుల నివేదిక అందిస్తే మరో ఫైర్ స్టేషన్ ఏర్పాటుపై ఆలోచన చేస్తామన్నారు. కార్యక్రమంలో ఫైర్ ఆఫీసర్ కె.క్రాంతి కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

పోక్సో కోర్టులో ముద్దాయికి జీవిత ఖైదు

ఏలూరు (టూటౌన్): ముక్కుపచ్చలారని బాలికపై అత్యాచార యత్నం చేసి ఆపై హత్య చేసిన ఘటనలో ఏలూరు జిల్లా పోక్సో కోర్టు జడ్జి ఎస్.ఉమా సునంద మంగళవారం సంచలన తీర్పు ఇచ్చారు. గణపవరం పోలీస్ స్టేషన్ పరిధిలోని క్రైమ్ నెంబర్ 38/2017కు సంబంధించి కేశవరం గ్రామానికి చెందిన బొడ్డు ఏసుపై నేరం రుజువు కావడంతో 302 ఐపీసీ సెక్షన్ల కింద జీవిత ఖైదు, రూ.5 వేలు జరిమానా విధించారు. సాక్ష్యాలను తారుమారు చేసిన నేపథ్యంలో 7 సంవత్సరాలు జైలు, రూ.2 వేల జరిమానా విధించారు. బాధితురాలు కుటుంబానికి రూ.రెండు లక్షలు పరిహారం చెల్లించే విధంగా న్యాయమూర్తి ఎస్.ఉమా సునంద తీర్పును వెలువరించారు. 2017 మార్చి 29న రెండున్నర సంవత్సరాల బాలిక కేశవరం గ్రామంలో సంతమార్కెట్ వద్ద ఉన్న ఇంటి బయట మంచంపై నిద్రిస్తుంది. ఆ సమయంలో బాలిక తాతయ్య బొడ్డు ఏసు(50) పక్కనే ఉన్న పంట పొలాల వద్దకు బాలికను తీసుకెళ్లి ఆమెపై అత్యాచార ప్రయత్నం చేశాడు. బాలికకు రక్తస్రావం కావడంతో ఎవరికైనా చెబుతుందనే భయంతో ఆమెను పంట బోదెలో కి పలుమార్లు తొక్కి చంపేశాడు. ఈ విషయంపై బాలిక తల్లి బొడ్డు పోచమ్మ అప్పట్లో గణపవరం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసింది. దీనిపై అప్పటి ఎస్సై ఎం.వీరబాబు కేసు నమోదు చేయగా అప్పటి సీఐ ఎం.వెంకటేశ్వరరావు దర్యాప్తు చేశారు. ఇదే కేసులో సీఐ దుర్గాప్రసాద్ ముద్దాయిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు. ఈ కేసులో తదుపరి విచారణను రిటైర్డ్ డీఎస్పీ జి.వెంకటేశ్వరరావు దర్యాప్తు పూర్తి చేసి కోర్టులో చార్జీషీట్ దాఖలు చేశారు. ఈ కేసులో అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ డీవీ రామాంజనేయులు తన వాదనలను వినిపించారు. సకాలంలో సాక్షులను కోర్టులో హాజరుపర్చిన సీఐ ఎంవీ సుభాష్, కోర్టు మానిటరింగ్ సెల్ సీఐ ఎం .సుబ్బారావు, ఎస్సై మణికుమార్‌లను ఏలూరు జిల్లా ఎస్పీ కె.ప్రతాప్ శివ కిషోర్ అభినందించారు.

11న అయోధ్య - కాశీ పుణ్యక్షేత్ర యాత్ర

ఏలూరు (టూటౌన్): భారతీయ రైల్వే అనుబంధ సంస్థ ఐఆర్‌సీటీసీ ఆధ్వర్యంలో డిసెంబర్ 11న అయోధ్య – కాశీ పుణ్యక్షేత్ర యాత్ర నిర్వహిస్తున్నట్లు విజయవాడ ఏరియా మేనేజర్ ఎం.రాజా మంగళవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ రైలు సికింద్రాబాద్ నుంచి బయలుదేరి విజయవాడ, ఏలూరు, రాజమండ్రి, సామర్లకోట, తుని రైల్వే స్టేషన్లలో ఆగుతుందన్నారు. వచ్చే నెల 11న సికింద్రాబాద్‌లో బయలుదేరి తిరిగి 20వ తేదీన సికింద్రాబాద్ చేరుకుంటుందన్నారు. మొత్తం యాత్ర 9 రాత్రులు, 10 పగళ్లు ఉంటాయన్నారు. యాత్రలో భాగంగా పూరిలోని జగన్నాథ ఆలయం, కోణార్క్ సూర్య దేవాలయం, గయాలోని విష్ణుపాద దేవాలయం, వారణాసిలోని కాశీ విశ్వనాథ ఆలయం, కాశీవిశాలాక్ష్మి, అన్నపూర్ణదేవి ఆలయాల సందర్శన ఉంటుందన్నారు. కాశీలో సాయంత్రం గంగా హారతి దర్శనం ఉంటుందని పేర్కొన్నారు. అయోధ్యలోని సరయు నది ఒడ్డున రామజన్మభూమి, హనుమాన్ గర్హి, ఆరతి, ప్రయాగ్‌రాజ్‌లోని త్రివేణి సంగమం దర్శనాలు ఉంటాయన్నారు. రైలులో మూడు రకాల టిక్కెట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. స్లీపర్ క్లాస్ నందు ఒక్కొక్కరికి టిక్కెట్ వెల పెద్దలకు రూ.16,800, పిల్లలకు రూ.15,600, స్టాండర్డ్ థర్డ్‌క్లాస్ ఏసీ ప్రయాణానికి పెద్దలకు రూ.26,650, పిల్లలకు రూ.25,340, సెకండ్ ఏసీ క్లాస్ టిక్కెట్ పెద్దలకు రూ.34,916, పిల్లలకు రూ.33,330గా నిర్ణయించడం జరిగిందన్నారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: యువతి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ పీసీహెచ్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. జంగారెడ్డిగూడెం పట్టణానికి చెందిన యువతి ఏలూరు డెంటల్ కాలేజీలో చదువుకుని ఇంటి వద్దే ఉంటుంది. ఈ నెల 18న స్పెషల్ కేసు ఉందని చెప్పి ఏలూరు వెళ్లిందని, అనంతరం యువతి ఫోన్ స్విచ్ఛాఫ్ అయ్యిందని ఆమె తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. యువతి అదృశ్యం వెనుక శ్రీనివాసపురం గ్రామానికి చెందిన సీహెచ్ దిలీప్, మరో ఇద్దరిపై అనుమానం ఉన్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ తెలిపారు.

ఆర్టీసీ కార్గో సేవల్లో 'పశ్చిమ' భేష్

ఆర్టీసీ కమర్షియల్ మేనేజర్ జి.లక్ష్మీప్రసన్న వెంకట సుబ్బారావు



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్టీసీ కమర్షియల్ మేనేజర్ లక్ష్మీప్రసన్న వెంకట సుబ్బారావు

తణుకు అర్బన్: ఆర్టీసీ కార్గో సేవల్లో పశ్చిమగోదావరి జిల్లా ప్రథమ స్థానంలో నిలవడం అభినందనీయమని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఆర్టీసీ కమర్షియల్ మేనేజర్ జి.లక్ష్మీప్రసన్న వెంకట సుబ్బారావు అన్నారు. మంగళవారం తణుకు ఆర్టీసీ డిపో ఆవరణలోని కార్గో కార్యాలయంలో కార్గో ఏజెంట్లకు ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్గో కార్యాలయాలకు వచ్చే వినియోగదారులకు సత్వరమే సేవలందించాలని, మర్యాదపూర్వక సమాధానం అందించాలని ఏజెంట్లకు సూచించారు. కార్గో సేవలపై వినియోగదారులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని, ఆ నమ్మకాన్ని నిలబెట్టుకునే విధంగా ఏజెంట్లు కృషిచేయాలన్నారు. కార్గో సేవలకు సంబంధించి పశ్చిమ గోదావరి జిల్లా రాష్ట్రంలో 25 శాతం గ్రోత్ సాధించి మొదటి స్థానంలో ఉండడానికి జిల్లాలోని 4 డిపోల మేనేజర్లు, కార్గో ఏజెంట్ల కృషి ఫలితమేనని స్పష్టం చేశారు. కార్గో బుకింగ్ ఏజెంట్లుగా పనిచేయడానికి ఆసక్తి ఉన్న వారికి కేవలం రూ.వెయ్యి డిపాజిట్‌తో ఈ అవకాశం ఇస్తున్నట్లు చెప్పారు. డిపో మేనేజర్ సప్పా గిరిధర్‌కుమార్, సూపరింటెండెంట్ వెన్నా రమణమూర్తి, డిపో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ షేక్ లాల్, సింగ్ సొల్యూషన్ టీం లీడర్ నవీన్, తణుకు నియోజకవర్గ కార్గో ఏజెంట్లు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత



కోళ్ల ఫారంలో నిల్వ ఉంచిన రేషన్ బియ్యంను పట్టుకున్న అధికారులు

ఆగిరిపల్లి: ఆగిరిపల్లిలో పామర్తి రమేష్‌కు చెందిన కోళ్ల ఫారంలో అక్రమంగా నిల్వ ఉంచిన 12 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పౌరసరఫరాల శాఖ డీటీ వెంకటేశ్వర రావు తన సిబ్బందితో కలిసి దాడి పట్టుకున్నారు. రేషన్ బియ్యం బస్తాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

చోరీ కేసులో వ్యక్తి అరెస్ట్



నిందితుడి నుంచి చోరీ సొత్తు స్వాధీనం చేసుకుని, వివరాలు వెల్లడిస్తున్న ఎస్సై వెంకన్న

లింగపాలెం: చోరీ కేసులో నిందితుడిని అరెస్టు చేసినట్లు ఎస్సై వెంకన్న తెలిపారు. వివరాల ప్రకారం ధర్మాజీగూడెంకు చెందిన మేకల హరి గోపాల్ తన ఇంటి పక్కనే ఉన్న ఇంట్లో చోరీకి పాల్పడి బంగారపు నల్లపూసల గొలుసును అపహరించాడు. బాధితులు ఫిర్యాదు చేయగా మంగళవారం పోలీసులు గోపాల్‌ను అదుపులోకి తీసుకుని, అతని వద్ద నుంచి చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. నిందితుడ్ని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై చెప్పారు.



భీమవరం (ప్రకాశం చౌక్): దీపాలంకరణలో బాలాత్రిపుర సుందరి అమ్మవారు



భీమవరం (ప్రకాశం చౌక్): ప్రత్యేక అలంకరణలో శ్రీఉమాసోమేశ్వర స్వామి



భీమవరం (ప్రకాశం చౌక్): కార్తీక పూజలు చేస్తున్న మహిళలు

కార్తీక దీపోత్సవం





పెనుమంట్ర: మార్టేరులో జ్యోతిర్లింగార్చన చేసిన భక్తులు, పార్థివ లింగేశ్వరునికి లక్ష బిల్వార్చన

భీమవరం (ప్రకాశంచౌక్), పెనుమంట్ర: కార్తీక మాసం ఆరుద్ర నక్షత్రం సందర్భంగా మంగళవారం శివాలయాలు హర నామస్మరణతో మార్మోగాయి. పంచారామక్షేత్రం శ్రీఉమాసోమేశ్వర జనార్దనస్వామి వారి దేవస్థానంలో శ్రీఉమాసోమేశ్వరునికి ప్రత్యేక అభిషేకాలు, అష్టోత్తర దీపాలంకరణ పూజలు నిర్వహించారు. భీమవరం మెంటేవారి తోటలోని విజయ కనకదుర్గ శ్రీచక్ర సహిత బాల త్రిపుర సుందరి అమ్మవారి దేవస్థానంలో లక్ష దీపోత్సవం, మహా లింగార్చన నిర్వహించారు. దీపోత్సవంలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తి ప్రపత్తులతో దీపాలను వెలిగించారు. మార్టేరు గ్రామంలోని శ్రీవేంకటేశ్వరస్వామి, శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయాల ఆవరణలో పార్థివ లింగేశ్వరునికి లక్ష బిల్వార్చన, జ్యోతిర్లింగార్చన పూజలు జరిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్



■ మా సంస్థ ద్వారా ఉంగుటూరులో గల ప్రముఖ పరిశ్రమ నందు పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. డ్యూటీ 12గం॥లు ఆకర్షణీయమైన జీతం. సంప్ర॥99895 30260. [P-772841]

■ ప్రముఖ కంపెనీలో వర్క్ చేయుటకు స్త్రీ, పురుషులు కావలెను. Qul: 10th - డిగ్రీ, Sal: 20K - 30 K మీ అడ్రస్ వాట్సప్ చేయగలరు. వర్క్ ఫ్రం హోం అవకాశం కలదు. 8121818692 [M-1253919]

■ కన్సల్టెన్సీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు, ఆయా, నర్సులు, వంటవారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ: 15 వేలు - 40వేలు,ఫ్రీ రూం+భోజనం.HYD.7995984445 [HA-99066]



గమనిక

సాక్షి తెలుగు దిన పత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

క్లుప్తంగా

సామూహిక హనుమాన్, గాయత్రి పూజలు


సత్యసాయి మందిరంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): సత్యసాయి జయంత్యుత్సవాల్లో భాగంగా స్థానిక డీఎస్ చెరువు వద్ద సత్యసాయి బాబా మందిరంలో మంగళవారం సామూహిక హనుమాన్, గాయత్రి అష్టోత్తర పూజలు, హనుమాన్ చాలీసా, గాయత్రి మంత్ర పూజలు నిర్వహించారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కన్వీనర్ ఎంఎస్ఎస్‌కే జనార్దనరావు, నవీన్ బాబా, ప్రవా శ్రీనివాస్, శోభనాద్రిరావు, రాము పాల్గొన్నారు.

26 మంది వృద్ధులకు వైద్య పరీక్షలు


తణుకులో వైద్యసేవలు అందిస్తున్న దృశ్యం

తణుకు అర్బన్: సజ్జాపురం సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి మంగళవారం 26 మంది వృద్ధులు హాజరయ్యారు. స్థానిక రాష్ట్రపతి రోడ్డులోని అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించిన ఈ వైద్య శిబిరంలో డాక్టర్ భూపతిరాజు రమేష్‌చంద్రబాబు వైద్య సేవలందించారు. ఈ సందర్భంగా సుగర్, బీపీ పరీక్షలు నిర్వహించి, పేదలకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం వృద్ధులకు ఆహార అలవాట్లు, వ్యాయామం, నడక వంటి అంశాలపై అవగాహన కల్పించారు. జిల్లా అధ్యక్షుడు అడ్డాల సత్యనారాయణ, తణుకు శాఖ అసోసియేషన్ అధ్యక్షుడు ఈదర ప్రసాదరావు, కార్యదర్శి కోసూరి గాంధీ, ఉపాధ్యక్షుడు ద్వారంపూడి బాపిరెడ్డి, సభ్యులు ఇవటూరి లక్ష్మణరావు, చేబ్రోలు సాధు పాల్గొన్నారు.

అలరించిన హరికథా గానం


భక్త మార్కండేయ హరికథా గానం చేస్తున్న తిరుపతికి చెందిన ముని లక్ష్మి

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని మహాలక్ష్మినగర్ రోడ్డు– 4లో సప్తాహ నిర్వాహకులు కర్రి ప్రభాకర్ బాలాజీ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి తిరుపతికి చెందిన ముని లక్ష్మి భాగవతారిణి భక్త మార్కండేయ హరికథను గానం చేశారు. సరస్వతులు హనుమంతరావు (తాడేపల్లిగూడెం), బీహెచ్‌కే సీతాపతిరావు (హైదరబాద్) వాయిద్యం, వయోలిన్ సహకారం అందజేశారు. మార్కండేయుడు జీవిత విశేషాలు, బాలుడిగానే యముడిని జయించిన విధానం, శివుడి ఆశీస్సులతో చిరంజీవత్వాన్ని పొందిన సద్గుణుడు మార్కండేయుడని వివరిస్తూ కొనసాగిన హరికథ గానం అందరినీ అలరించింది. స్థానికులు, కళాకారులు, అభిమానులు, మహిళలు పాల్గొన్నారు.

నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించాలి


మాట్లాడుతున్న బి.బలరాం

తాడేపల్లిగూడెం (టీఓసీ): రోజు రోజుకూ పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలను అరికట్టాలని సీపీఎం రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యులు మంతెన సీతారాం, జిల్లా సెక్రటేరియట్ సభ్యులు బి.బలరాం డిమాండ్ చేశారు. స్థానిక పుచ్చపల్లి సుందరయ్య భవనంలో పార్టీ 8వ మహాసభ కరెడ్ల రామకృష్ణ, గొల్లు లక్ష్మి, జవ్వాది శ్రీను అధ్యక్షతన నిర్వహించారు. తొలుత అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ప్రభుత్వం నిలుపుదల చేయాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సమస్యలను పరిష్కరించాలని, లేని పక్షంలో సీపీఎం ఆధ్వర్యంలో ప్రజా సమస్యలపై విస్తృత పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. జిల్లా నాయకులు చింతకాయల బాబూరావు, జేఎన్‌వీ గోపాలన్, కర్రి నాగేశ్వరరావు, చిర్ల పుల్లారెడ్డి, సిరపరపు రంగారావు, కార్మికులు పాల్గొన్నారు.

కొండాలమ్మ ఆలయం వద్ద అన్నసమారాధన

తాడేపల్లిగూడెం రూరల్: కుంచనపల్లిలోని కొండాలమ్మ ఆలయం వద్ద మంగళవారం అన్నసమారాధన నిర్వహించారు. గ్రామానికి చెందిన సుంకర కొండలరావు (చిన్ని) కుటుంబ సభ్యుల సహకారంతో ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. స్థానికులతో పాటు పరిసర గ్రామాల ప్రజలు అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

రహదారులే ధాన్యం కల్లాలు

- వాతావరణ మార్పులతో రైతు గుండెల్లో గుబులు
- కల్లాలు లేక ఆందోళనలో రైతులు


తాడేపల్లిగూడెం మండలం మారంపల్లి - జగన్నాథపురం రహదారిపైనే ధాన్యాన్ని ఆరబోసిన రైతులు

తాడేపల్లిగూడెం రూరల్: ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యాన్ని ఆరబెట్టుకోవడానికి, నిల్వ చేసుకునేందుకు కల్లాలు, గోదాములు లేక రైతులు, కౌలుదారులు ఏటా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం 17 తేమ శాతం కలిగిన ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేయడంతో రైతులు ధాన్యాన్ని ఆరబెట్టేందుకు రహదారులను ఆశ్రయించి వాటినే కల్లాలుగా వినియోగించుకుంటున్నారు. తాడేపల్లిగూడెం మండలంలో దాదాపు 12 వేల హెక్టార్లలో వరి సాగవుతుంది. ఇప్పటికే బోర్లపై సార్వా పంట సాగు చేసిన 80 శాతం మందికి పైగా రైతులు పచ్చిపైనే ధాన్యాన్ని కమీషన్‌దారులకు అయినకాడికి విక్రయించి చేతులు దులుపుకుని దాళ్వా సాగుకు సమాయత్తమవుతున్నారు. ప్రస్తుతం గోదావరి కాలువ ఆయకట్టు గ్రామాలైన నవాబుపాలెం, ఆరుళ్ల, మారంపల్లి, జగన్నాథపురం, నందమూరు తదితర గ్రామాల్లో రైతులు యంత్రాలతో వరి కోస్తున్నారు. ఇలా కోయగా వచ్చిన పచ్చి ధాన్యాన్ని ఆరబెట్టుకునేందుకు కల్లాలు లేక రైతులు రోడ్లపైకి తీసుకువచ్చి ఆరబెట్టుకుంటున్నారు. వాతావరణం రోజుకోరకంగా మారుతుండటంతో రైతుల గుండెల్లో గుబులు పుడుతోంది. ఆకాశం మేఘావృతమైతే రైతులు ఉరుకులు పరుగులపై ఆరబోసిన ధాన్యాన్ని రక్షించుకునేందుకు అవస్థలు పడాల్సి వస్తోంది. ధాన్యాన్ని దాచుకునేందుకు గోదాములు లేకపోవడంతో వారి ఇబ్బందులు వర్ణనాతీతం. రహదారులు, ఖాళీ స్థలాల్లో ఆరబోసిన ధాన్యాన్ని సాయంత్రం రాశులుగా పోసి టార్పాలిన్లు కప్పి రాత్రి, పగలూ కాపలా కాస్తూ కంటికి రెప్పలా కాపాడుకుంటున్నారు. గతంలో తాడేపల్లిగూడెంలోని నాటి విమానాశ్రయ భూముల్లో (ప్రస్తుతం ఏపీ నిట్) ధాన్యాన్ని రైతులు ఆరబెట్టుకునే వారు. అక్కడ నిట్ విద్యాలయం నిర్మాణంతో రైతులకు ఆ అవకాశం లేకుండాపోయింది. దీంతో చేసేది లేక రైతులు ధాన్యాన్ని రహదారులపై, పొలాల్లోనే రాశులుగా పోసి నిల్వ చేస్తున్నారు.

ప్రభుత్వ భూములను కల్లాలుగా మార్చాలి



గ్రామాల్లో రహదారులను ఆనుకుని ప్రభుత్వ భూములున్నాయి. వాటిని సర్వే చేసి రైతులకు కల్లాలుగా అందిస్తే బాగుంటుంది. దీనివల్ల రహదారులపై ధాన్యాన్ని ఆరబెట్టుకునే దుస్థితి రైతుకు ఉండదు. ప్రభుత్వం రైతు శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని కల్లాలను ఏర్పాటు చేయాలి.

– సారిక లక్ష్మణరావు, కౌలు రైతు, మారంపల్లి, తాడేపల్లిగూడెం మండలం

పుంత రోడ్లను అభివృద్ధి చేయాలి



చాలా గ్రామాల్లో పొలాలకు వెళ్లడానికి పుంత రోడ్లు సక్రమంగా లేవు. వర్షాకాలం వస్తే పొలాలకు వెళ్లేందుకు సరైన రహదారి లేక ట్రాక్టర్లు దిగబడిపోయి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామ శివారు పొలాలకు వెళ్లడానికి పుంత రోడ్లు నిర్మించాలి. తద్వారా ధాన్యాన్ని ఆరబోసి, సురక్షితంగా కొనుగోలు కేంద్రాలకు తీసుకురావడానికి అవకాశం ఏర్పడుతుంది.

– శ్రీమంతుల వెంకట్రావు, కౌలు రైతు, మారంపల్లి, తాడేపల్లిగూడెం మండలం

ఘనంగా జాతీయ మహిళా దినోత్సవం


తాడేపల్లిగూడెం గ్రంథాలయంలో డాక్టర్ సహజను సత్కరిస్తున్న దృశ్యం


అత్తిలి గ్రంథాలయంలో రంగవల్లుల పోటీలో పాల్గొన్న విద్యార్థినులు

తాడేపల్లిగూడెం (టీఓసీ) : జాతీయ గ్రంథాలయ దినోత్సవం సందర్భంగా ప్రథమ శ్రేణి స్థానిక శాఖ గ్రంథాలయంలో మంగళవారం జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. మహిళా సాధికారతపై చర్చా గోష్ఠి నిర్వహించారు. గ్రంథాలయ అధికారి వి.శ్రీనివాసరావు పర్యవేక్షించారు. తొలుత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. డాక్టర్ సహజను సత్కరించారు. ఉమెన్స్ కళాశాల అధ్యాపకుడు పీఎల్ఎన్ సంధ్య, లలిత, విద్యార్థులు మాట్లాడారు. గరికిపాటి బాపయ్య శర్మ, జాన్‌బాబు, సత్యం, జనార్దనరావు, ఐ.జయప్రద మాట్లాడారు.

విద్యార్థినులకు రంగవల్లుల పోటీ

అత్తిలి : జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం అత్తిలి శాఖ గ్రంథాలయంలో మహిళాదినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థినులకు రంగవల్లుల పోటీ నిర్వహించారు. బాలికల ఉన్నత పాఠశాల ఉపాధ్యాయిని పి.శుభలక్ష్మి, బి.మహాలక్ష్మి, ఎం.దేవి న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. చట్టాలు, మహిళా సాధికారతపై అవగాహన కల్పించారు. గ్రంథపాలకుడు డి కృష్ణారావు, గ్రామీణ గ్రంథాలయాధికారి ఆర్ దానకృష్ణ, రిటైర్డు ఉపాధ్యాయుడు కె గాబ్రియేల్‌జాన్ పాల్గొన్నారు.

సమాజ సేవలు అభినందనీయం


త్రిపుల్‌ఎఫ్, స్వాభిమాన్ ట్రస్టు ప్రతినిధులకు అవార్డును అందజేస్తున్న కలెక్టర్ నాగరాణి

పెంటపాడు: పలు రంగాల్లో త్రిపుల్‌ఎఫ్, స్వాభిమాన్ ట్రస్టు అందిస్తున్న సేవలు మరువలేనివని కలెక్టర్ చదలవాడ నాగరాణి పేర్కొన్నారు. కరెంట్ లేని సమయంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీకి రక్తం సేకరణకు ఉపయోగపడే 62.5 కేవీ సామర్థ్యం కలిగిన జనరేటన్‌ను ప్రత్తిపాడు త్రిపుల్‌ఎఫ్ కర్మాగారం, స్వాభిమాన్ ట్రస్టు వ్యవస్థాపకులు అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ త్రిపుల్ ఎఫ్ యాజమాన్యాన్ని ప్రత్యేకంగా అభినందించి భీమవరం కలెక్టరేట్‌లో జ్ఞాపిక బహూకరించారు. ఓపీ గోయంకా సమాజాభివృద్ధికి అందించిన సేవలు మరువలేనివని ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి అన్నారు. ఈ కార్యక్రమంలో త్రిపుల్ ఎఫ్ కర్మాగార ప్రతినిధులు, స్వాభిమాన్ ట్రస్టు ప్రతినిధులు , పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.


అప్పారావుపేటలో నిర్మిస్తున్న సీసీ రోడ్డును పరిశీలిస్తున్న కలెక్టర్ నాగరాణి

రోడ్ల నిర్మాణాన్ని పరిశీలించిన కలెక్టర్

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని అప్పారావుపేట, పట్టణంలోని 11వ వార్డులో నిర్మిస్తున్న సీసీ రోడ్లను మంగళవారం కలెక్టర్ చదలవాడ నాగరాణి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోడ్ల పనుల్లో నాణ్యతా ప్రమాణాలను పాటించి పటిష్టంగా నిర్మించాలని సూచించారు. అనంతరం 11వ వార్డులోని సచివాలయాన్ని పరిశీలించి ఆధార్ నవీకరణ ప్రక్రియపై సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆర్డీవో ఖతీబ్ కౌసర్ బనో, జిల్లా పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ అధికారి కె.శ్రీనివాసరావు, డ్వామా పీడీ డాక్టర్ కేసీహెచ్.అప్పారావు, జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి నాగేశ్వరరావు, తహసీల్దార్ సునీల్‌కుమార్, ఎంపీడీవో విశ్వనాథం ఉన్నారు.

కాలువ గట్టుపై చెట్ల నరికివేత


రావిపాడులో వెంకయ్య కాలువను ఆనుకొని ఉన్న చెట్లను పూర్తిగా తొలగించిన దృశ్యం

పెంటపాడు: రావిపాడులో ఇష్టానుసారంగా భారీ వృక్షాలను వారం రోజుల నుంచి నరికి వేస్తున్నారు. గ్రామంలోని సాయిబాబా ఆలయం నుంచి బెండలంక వరకు వెంకయ్య కాలువ గట్టును ఆనుకొని పెరిగిన పలు చెట్లను నేల కూల్చారు. ఇప్పటివరకు భారీ వృక్షాలతో ఎంతో ఆహ్లాదంగా ఉండే ఈ రహదారి చెట్లను నరికివేయడంతో ప్రస్తుతం వెలవెలబోతోంది. విద్యుత్ శాఖ సిబ్బంది జంగిల్ క్లియరెన్స్‌లో భాగంగా చెట్ల కొమ్మలు మాత్రమే తొలగిస్తారని, చెట్ల మొదలుకు నరకాల్సిన పనిలేదని స్థానికులు అన్నారు. దీనిపై పంచాయతీ సిబ్బంది స్పందించడం లేదని గ్రామ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై మండల ఎలక్ట్రికల్ ఏఈ పద్దరాజును వివరణ కోరగా తమ దృష్టికి చెట్ల తొలగింపు విషయం రాలేదన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరునికి ప్రత్యేక అలంకరణ

పెంటపాడు: విప్పర్రు సంతాన సుబ్రహ్మణ్యేశ్వరునికి మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. ఉప్పాకపాడుకు చెందిన ముత్యాలమ్మ భజన సమాజం లలిత సహస్రనామాలు ఆలపించారు. ఆలయ నిర్వాహకులైన పసల కుటుంబీకుల ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన నిర్వహించారు. అర్చకులు, భక్తులు స్వామివారిని పలు రకాల కూరగాయలతో శాకంబరిగా అలంకరించారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

అత్తిలి: మండలంలో త్వరలో నిర్వహించనున్న ఐదు సాగునీటి వినియోగదారుల సంఘాల ఎన్నికల నిమిత్తం ఏర్పాటు చేయనున్న పోలింగ్ కేంద్రాలను మంగళవారం అత్తిలి తహసీల్దార్ వంశీ పరిశీలించారు. అత్తిలి మండలంలోని పాలూరు, ఉరదాళ్లపాలెం, అత్తిలి బాలికోన్నత పాఠశాలలను పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. అత్తిలి, పాలూరు, మంచిలి, ఉరదాళ్లపాలెం, ఆరవల్లి నీటి సంఘాల ఎన్నికలలో 19 వేల మంది రైతులు ఓటు హక్కు వినియోగించుకోనున్నారని తహసీల్దార్ తెలిపారు.

ఉల్లాసంగా కార్తీక వన సమారాధనలు


ఛాంబర్ వన సమారాధనలో విజేతలకు బహుమతుల ప్రదానం


మాస్టర్ ప్రింటర్స్ నూతన కార్యవర్గం

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ 40వ కార్తీక వన సమారాధన మంగళవారం మండలంలో ఘనంగా నిర్వహించారు. ఉసిరిచెట్టుకు పూజలు, ఆటపాటలతో, సహపంక్తి భోజనాలతో ఉల్లాసంగా ఈకార్యక్రమం జరిగింది. పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, పిల్లలు, పెద్దలు, మహిళలు హాజరయ్యారు. ఛాంబర్‌నాయకులు ఈతకోట తాతాజీ, సభ్యులు, వర్తకులు హాజరయ్యారు.

మాస్టర్ ప్రింటర్స్ ఆధ్వర్యంలో..

బండారు నాగన్నతోటలో మంగళవారం మాస్టర్ ప్రింటర్స్ ఆధ్వర్యంలో కార్తీక వన సమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులను ఎనున్నుకున్నారు. అధ్యక్షుడిగా గాదం మురళీకృష్ణ, కార్యదర్శిగా పి.రాజేష్‌కుమార్, కోశాధికారిగా దాసరి ఆంజనేయులను ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడు పీటీ వెంకన్న, కాశీకృష్ణ, వర్రి సత్యనారాయణ, ఆవుల రమణ, నాగేంద్రకుమార్, గంగాధరరెడ్డి, రత్నాకర్ రెడ్డి, సభ్యులు హాజరయ్యారు. అనంతరం తోటలో సహపంక్తి భోజనాలు చేశారు.

గర్భిణులు, బాలింతల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

పెంటపాడు: గర్భిణులు, బాలింతల ఆరోగ్యంపై వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ వహించాలని డీపీహెచ్ఎన్‌వో వెంకటరత్నం పేర్కొన్నారు. మంగళవారం ఆమె పెంటపాడు పంచాయతీ కార్యాలయం వద్ద ఆరోగ్య సబ్ సెంటర్ కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆరోగ్య సిబ్బందితో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించారు. సీహెచ్‌వో సుజాత, హెచ్‌సీ నాగమణి, ఏఎన్ఎం ఈశ్వరి, ప్రసన్న లక్ష్మి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.


సమీక్షిస్తున్న డీపీహెచ్ఎన్‌వో వెంకటరత్నం

దళారులకు ధాన్యం విక్రయించి మోసపోవద్దు


దువ్వ రైతుసేవా కేంద్రంలో రైతులు, సిబ్బందితో మాట్లాడుతున్న జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి

తణుకు టౌన్: దళారులకు ధాన్యం విక్రయించి మోసపోవద్దని, రైతు సేవా కేంద్రాల ద్వారా మద్దతు ధర పొంది ఆర్థికంగా బలపడాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి రైతులకు సూచించారు. మంగళవారం తణుకు మండలం దువ్వ రైతు సేవా కేంద్రాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్ల సమయంలో తూకం, తేమ శాతం, రికార్డుల నిర్వహణ, డేటా ఎంట్రీలను ఈ సందర్భంగా ఆయన పరిశీలించారు. రైతు తమకు ఇష్టం వచ్చిన రైసు మిల్లులకు ధాన్యాన్ని తరలించి విక్రయించుకునే వెసులుబాటు అందుబాటులో ఉందని స్పష్టం చేశారు. ముందుగా రైతులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో ఖతీబ్ కౌసర్ భానో, తహసీల్దారు డీవీఎస్ అశోక్‌వర్మ, రెవెన్యూ, వ్యవసాయ, సివిల్ సప్లై, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి


పరిమెళ్లలో ధాన్యాన్ని రోడ్లపై ఆరబోసిన రైతులతో మాట్లాడుతున్న జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి

పెంటపాడు: ప్రభుత్వం ఏర్పాటు చేసిన రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోళ్లను అధికారులు వేగవంతం చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన పరిమెళ్ల, యానాలపల్లి గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా రహదారులపై ధాన్యం ఆరబోసిన రైతులతో మాట్లాడారు. గోనె సంచుల సరఫరా, సంబంధిత అధికారులు అందిస్తున్న సహాయ సహకారంపై రైతులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పరిమెళ్ల రైతు సేవా కేంద్రంలో ధాన్యం తేమ శాతం యంత్రం పనితీరును ఆయన పరిశీలించారు. రిజిస్టర్లను, ఇతర పరికరాలను పరిశీలించారు. ధాన్యం కొనుగోలు వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వాతావరణ పరిస్థితుల దృష్ట్యా రైతులు ఇబ్బందులు పడకుండా ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. తహసీల్దార్ ఏడిద శ్రీనివాస్, రెవెన్యూ, సివిల్ సప్లై అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం


మాట్లాడుతున్న జిల్లా బాలికా సంరక్షణాధికారి రాజేష్

తాడేపల్లిగూడెం రూరల్: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని జిల్లా బాలికా సంరక్షణాధికారి ఆర్.రాజేష్ అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో బాల్య వివాహ నిరోధక చట్టం–2006పై డివిజనల్ స్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ 18 ఏళ్ల లోపు బాలికలకు వివాహాలు చేయరాదన్నారు. తద్వారా మహిళల్లో శారీరక, మానసిక సమస్యలు ఉత్పన్నమవుతాయని హెచ్చరించారు. అడాప్షన్ మేనేజర్ జయలక్ష్మి మాట్లా డుతూ అనధికారిక దత్తత వల్ల కలిగే అనర్థాలు, శిక్షలను వివరించారు. నిర్దేశిత వెబ్ సైట్ ద్వారా మాత్రమే పిల్లల్ని దత్తత తీసుకోవాలని సూచించారు. పట్టణ ఎస్సై పి.నాగరాజు, ఎంపీడీవో ఎం.విశ్వనాథ్ మాట్లాడారు. తాడేపల్లిగూడెం, తణుకు ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవోలు టీఎల్. సరస్వతి, ప్రమోద, డివిజన్‌లోని సూపర్‌వైజర్లు, గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శులు పాల్గొన్నారు.

గురుకులంలో సమస్యలపై సమీక్ష


ఆరుగొలను గురుకుల పాఠశాలలో సమీక్ష సమావేశం

తాడేపల్లిగూడెం రూరల్: ఆరుగొలను డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో నిబంధనలకు విరుద్ధంగా కూల్‌డ్రింక్‌లు, ఐస్ క్రీమ్‌లు, ఇతర ఆయిల్ పదార్థాలను విక్రయించడంపై సర్పంచ్ పీతల బుచ్చిబాబు, ఎస్ఎంసీ చైర్మన్ విచారణ నిర్వహించారు. పాఠశాలలోని బియ్యం బస్తాలు చోరీకి గురైనట్లు సమావేశం దృష్టికి తెచ్చారు. దీనికంతటికీ పాఠశాలలో పనిచేసే వ్యక్తే కారణమని వారు ఆరోపించారు. అనంతరం పాఠశాలను వారు తనిఖీ చేశారు. దీనిపై ప్రిన్సిపల్ శ్రీనివాస్ మాట్లాడుతూ బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. జనసేన గ్రామ అధ్యక్షుడు అడపా వీరన్న, ఎస్ఎంసీ సభ్యుడు కాసగాని రాజేష్, తెలుగు యువత నియోజకవర్గ కార్యదర్శి గరిపాక మూర్తి, చిలకా ప్రసాద్, దండగర్ర సర్పంచ్ పిల్లా రాంబాబు, నక్కా రాజు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

చదరంగం పోటీలు ప్రారంభం


చదరంగం పోటీలను ప్రారంభిస్తున్న ఈతకోట తాతాజీ

తాడేపల్లిగూడెం (టీఓసీ): మాస్టర్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో ఏపీ స్టేట్ అండర్– 13 ఓపెన్ అండ్ గరల్స్ చదరంగం పోటీలు తాడేపల్లిగూడెం గుణ్ణం వేణుగోపాల ఫంక్షన్ హాల్‌లో మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. అన్ని జిల్లాల నుంచి 160 మంది బాల బాలికలు హాజరయ్యారు. రెండు రోజుల పాటు ఈ పోటీలు కొనసాగనున్నాయి. ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ రాష్ట్ర సీనియర్ నాయకుడు ఈతకోట తాతాజీ పోటీలను ప్రారంభించారు. ఆంధ్ర చెస్ అసోసియేషన్ వైస్ చైర్మన్ సీహెచ్ఏఆర్‌కే వర్మ, సింగం కృష్ణ, సింగం సుబ్బారావు, బొలిశెట్టి రాజేష్, దాట్ల జగన్నాథరాజు, ఫణికుమార్ హాజరయ్యారు. స్పాన్సర్స్ సింగం పట్టాభి జానకమ్మల సేవా ట్రస్ట్ పోటీలకు సహకరించారు. టోర్నమెంట్ డైరెక్టర్ ఎస్.ఎస్.చంద్రశేఖర్ తదితరులు పర్యవేక్షించారు.

రేపు డయల్ యువర్ డీఎం

తాడేపల్లిగూడెం (టీఓసీ): బస్సు, సర్వీసులు, కార్గో సేవలపై వినియోగదారులు, ప్రయాణికులు తమ అభిప్రాయాలను, సూచనలను, సలహాలను, ఫిర్యాదులు తెలపాలని ఏపీఎస్‌ఆర్టీసీ డిపో మేనేజర్ యేలూరి సత్యనారాయణ మూర్తి కోరారు. ఈ నెల 21వ తేదీ గురువారం ఉదయం 11 నుంచి 12 గంటల మధ్యలో డయల్ యువర్ డీఎం నిర్వహిస్తామని ప్రయాణీకులు, వినియోగదారులు 99592 25488 నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదులు తెలపాలని విజ్ఞప్తి చేశారు.

గోయంకాలో నేడు జాబ్ మేళా

పెంటపాడు: పెంటపాడు డీఆర్ గోయంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం ఉదయం 10 కంపెనీల ప్రతినిధులతో భారీ జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్. వెంకటేశ్వరరావు తెలిపారు. ఇంటర్, డిగ్రీ, పీజీ, ఫార్మసీ, కోర్సులు పూర్తి చేసిన 27–30 మధ్య వయస్సున్న పురుష, స్త్రీ అభ్యర్థులు ఈ జాబ్ ఫెయిర్‌లో పాల్గొవచ్చన్నారు. వివరాలకు కళాశాల సిబ్బంది (సెల్ ఫోన్: 8500067765)ని సంప్రదించాలని ప్రిన్సిపాల్ సూచించారు.

